

బీసీలకు రాజ్యాధికారం
రాజకీయ చైతన్యంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అన్నారు. 8లో▸



గంజాయి పట్టివేత
అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వారిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. 8లో▸



మహిళలకు గౌరవం
ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలతో మహిళలకు ఆత్మగౌరవం పెగిందని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కాంగ్రెస్ గూటికి కసిరెడ్డి

- ఖర్గే, రాహుల్ సమక్షంలో పార్టీలో చేరికకు నిర్ణయం
- 50 మంది నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లేందుకు ఏర్పాట్లు



నారాయణరెడ్డి

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ సమక్షంలో హస్తం కండువా కప్పుకోనున్నారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కసిరెడ్డితో కలిసి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన నారాయణరెడ్డి కొద్ది రోజులుగా అధిష్టానం తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడి మేరకు ఇటీవల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలతో భేటీ అయ్యారు. టికెట్ విషయంలో స్పష్టత వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరేందుకు డిసైడయ్యారు. సుమారు 50 మంది నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లనున్నారు.

నేడు రావిర్యాలలో అల్పాహార పథకం ప్రారంభం

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందించే అల్పాహార పథకాన్ని శుక్రవారం తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల స్కూల్‌లో ప్రారంభించనున్నారు. ఉదయం 8 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పథకాన్ని ప్రారంభిస్తారు.

'ఉప్పల'కు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ పదవి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయన జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఉప్పల ట్రస్టు పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ కసిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన పలు సమావేశాల్లోనూ ఆయన పాల్గొన్నారు. అనూహ్యంగా మంత్రి కేటీఆర్ నుంచి ఆయనకు పిలుపు రావడం, బీఆర్‌ఎస్‌లో చేరాలని కోరడం, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి వెళ్లి.. పార్టీ తీర్థం పుచ్చుకోవడం చకచకా జరిగిపోయాయి. ఆ వెంటనే వెంకటేశ్‌ను మిషన్ భగీరథ వైస్ చైర్మన్ పదవి వరించింది.

రూ.2.19 కోట్ల విలువైన బంగారం పట్టివేత

రూ.16.24 లక్షల విదేశీ కరెన్సీ కూడా..

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఆరుగురు వేర్వేరు ప్రయాణికుల నుంచి రూ.2.19 కోట్ల విలువ చేసే బంగారం, రూ.16.24 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ అధికారులు బుధవారం రాత్రి, గురువారం ఉదయం చేపట్టిన తనిఖీల్లో దుబాయ్ నుంచి వచ్చిన నలుగురు వేర్వేరు ప్రయాణికుల్లో ఒకరు ప్యాంటులో దాచుకుని తీసుకొచ్చిన 724 గ్రాములు, మరో ప్రయాణికుడు ప్యాంటు లోపలి భాగంలో బంగారం స్ప్రేగా చల్లుకుని 214 గ్రాములు, లోదుస్తుల్లో ఓ ప్రయాణికుడు దాచుకుని తీసుకొచ్చిన 840 గ్రాములు, లోదుస్తుల్లో 734 గ్రాముల బంగారు కడ్డీని మరో ప్రయాణికుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. షార్జా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు విమానంలో సీటు వెనకాల దాచిన 1220 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి బహ్రెయిన్ వెళుతున్న ఓ ప్రయాణికుడు ఎలాంటి అనుమతి లేకుండా తీసుకెళుతున్న యూఎస్ డాలర్లు భారత కరెన్సీలో రూ.16.24 లక్షలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

488 మంది పోకిరీల అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు జరిగిన ఉత్సవాలపై నగర షీ–టీమ్స్‌కు చెందిన ప్రత్యేక బృందాలు డేగకన్ను వేసి సుమారు 488 మంది పోకిరీలను పట్టుకున్నామని గురువారం డీసీపీ కవిత ప్రకటించారు. కేవలం నిమజ్జనం రోజునే కాకుండా విగ్రహాలను ఏర్పాటు చేసిన మండపాల దగ్గరా షీ–టీమ్స్ నిఘా వేశాయని, మఫ్టీల్లో, రహస్య కెమెరాలతో ఉన్న ఈ బృందాలకు మహిళలు, యువతులను వేధిస్తున్న పోకిరీలు చిక్కినట్లు ఆమె తెలిపారు. 122 మందిపై కేసులు నమోదు చేసి సాక్ష్యాధారాలతో సంబంధిత కోర్టుల్లో హాజరుపరిచినట్లు డీసీపీ తెలిపారు. వీరికి న్యాయస్థానం ఆరు రోజుల నుంచి మూడు రోజుల వరకు శిక్షలు విధించింది.



షాద్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, చిత్రంలో అనితారెడ్డి, మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి

అంజన్నను ఆదరించండి

గాలి మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ వాళ్లను నమ్మొద్దు

- సంక్షేమం అందించే కేసీఆర్ పాలనకే ఓటేయండి
- షాద్‌నగర్ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పిలుపు
- నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

షాద్‌నగర్ రూరల్: 'అంజన్నను మరోసారి ఆశీర్వదించండి.. షాద్‌నగర్ గడ్డ అంజయ్య యాదవ్‌దే ఇందులో డౌటేమీ లేదు. ప్రజల కోసం పనిచేసే నాయకుడికే పట్టం కట్టండి. మీ కష్టసుఖాల్లో మేముంటాం.. ఎన్నికల సమయంలో వచ్చి గాలి మాటలు చెప్పే వాళ్లను పట్టించుకోవద్దు' అని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గంలో ఆయన చేపట్టిన పర్యటన విజయవంతంగా సాగింది. నందిగామ, కొత్తూరు, షాద్‌నగర్‌లో సుడిగాలి చక్కర్లు కొట్టిన మంత్రి.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సభకు సుమారు 22 వేల మందికి పైగా హాజరయ్యారు.

కార్యకర్తల్లో జోష్

బహిరంగ సభలో మంత్రి చేసిన ప్రసంగం కార్యకర్తల్లో ఫుల్ జోష్‌ను నింపింది. కాంగ్రెస్, బీజేపీ హామీలపై తనదైన శైలిలో ఛలోక్తులు విసురుతూ ఆ పార్టీల నమ్మొద్దని ప్రజలకు సూచించారు. దోచుకునే పార్టీలు కావాలా.. సంక్షేమం అందించే కేసీఆర్ పాలన కావాలా..? ఆలోచించాలని సూచించారు. అంజయ్యయాదవ్ వంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉన్నందుకే షాద్‌నగర్‌లో రూ.4,669 కోట్లతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రజలకోసం పనిచేసే మన నాయకుడు కేసీఆర్, అభివృద్ధే మంత్రంగా ఆలోచించే అంజన్నను మీరంతా ఆశీర్వదించి, కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కొట్టినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. అంజన్నను కొట్టేవాడు ఇంకా పుట్టలేదు.. ఆయన సౌమ్యుడు.. ఎక్కువగా మాట్లాడడు కానీ పని బాగా చేస్తాడు అని ప్రసంశించారు.



తుక్కుగూడలోని రావిర్యాల వద్ద మహిళలతో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్

పాడిపంటలకు నెలవుగా తెలంగాణ

తుక్కుగూడ: తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో రూ.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. పాడి పరిశ్రమతో పాటు వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేస్తున్నారని తెలిపారు. ఆయన ఆలోచనతోనే తెలంగాణ రాష్ట్రం పాడి పంటలు, మత్స్య సంపదకు నెలవుగా మారిందని స్పష్టంచేశారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను మంత్రులు కేటీఆర్, తలసాని, మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సీఈఓ మంజులావాణి, కలెక్టర్ హరీశ్, మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈఈ యాదయ్య, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, సుమన్, బీఆర్‌ఎస్ నేత లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సభ సైడ్ లైట్స్

- ఉదయం 10:56 నిమిషాలకు హెలికాప్టర్‌లో కేటీఆర్ నందిగామకు చేరుకున్నారు.
- చాకలిదానిగుట్టతండాలో పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు.
- 11:10 నిమిషాలకు కొత్తూరులో మున్సిపల్ భవనం, డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభించారు.
- సుమారు 2వేల బైక్‌లతో కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.
- మధ్యాహ్నం 12:20 నిమిషాలకు షాద్‌నగర్‌కు చేరుకున్నారు.
- డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.
- 12:30 బంజారా భవన్‌కు శంకుస్థాపన చేశారు.
- 12:35కు బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు.
- 2గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రులు మహేందర్‌రెడ్డి, కేటీఆర్

అమాత్య తంత్రం..

అభివృద్ధి మంత్రం

- 'కోడ్' కూయకముందే పనులు చక్కబెడుతున్న అధికార పార్టీ
- సుడిగాలి పర్యటనలతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఒకే రోజు జిల్లాలో నలుగురు మంత్రుల పర్యటన
- పనిలో పనిగా ఎన్నికల ప్రచారమూ మరూ



హెలికాప్టర్‌లో పర్యటనకు వచ్చిన మంత్రి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'కోడ్' కూయకముందే పనులన్నీ చక్కబెట్టుకోవాలని అధికార పార్టీ నిర్ణయించింది. ఎన్నికల నగారా మోగేలోపు అభివృద్ధి పనుల శంకుస్థాపనలను ముమ్మరం చేస్తోంది. దీంతో వాయువేగంతో ప్రారంభోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలోనే పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ గురువారం సుడిగాలి పర్యటనలు చేశారు. హెలికాప్టర్‌లో చక్కర్లు కొడుతూ రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పర్యటించారు. మరోవైపు మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, తలసాని కూడా పలు కార్యక్రమాలకు హాజరవుతూ నియోజకవర్గాలను చుట్టేశారు. ఇప్పటికే నిర్మించిన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, దళిత, మైనార్టీ, బీసీబంధు లబ్ధిదారులకు చేయూత, నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో దూసుకుపోయారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ఇదే జిల్లా నుంచి శ్రీకారం చుట్టారు. అనంతరం ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లాలో పర్యటించారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లిలో కుల సంఘాల భవనాలకు, కందుకూరులో మెడికల్ కాలేజీ భవనాలకు, కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లులో పలు రోడ్లు, భవనాలకు శంకుస్థాపనలు చేశారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రెండు రోజుల క్రితం షాద్‌నగర్‌లో పర్యటించారు. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డ్రైవర్ కమ్ ఓనర్ పథకం కింద ఎంపిక చేసిన 120 మంది లబ్ధిదారులకు శంషాబాద్ మండలం ఆరాంఘర్‌లో హోంమంత్రి మహమూద్ అలీ వాహనాలను పంపిణీ చేశారు. తాజాగా ఐటీశాఖ మంత్రి కేటీఆర్ షాద్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, గిరిజన బంజారా భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు నిర్వహించారు. అటు నుంచి మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన విజయ డెయిరీ ప్లాంట్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. శుక్రవారం ఉదయం రావిర్యాల కేంద్రంగా 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నిజానికి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే ఆయన ఆరోగ్యం ఇంకా కుదుటపడక పోవడంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇక జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు.

గులాబీకి గుడ్ బై

- అధికార పార్టీకి మనోహర్‌రెడ్డి రాజీనామా
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు లేఖ
- నేడు హస్తం గూటికి చేరనున్న డీసీసీబీ చైర్మన్



మనోహర్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు గురువారం తన రాజీనామా లేఖను పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయన అధికార పార్టీని వీడుతుండటం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన మనోహర్‌రెడ్డి రాజీనామా ప్రభావం పరిగి నియోజకవర్గంపై పడనుంది. ఇదిలా ఉండగా తాండూరు నుంచి శాసనసభ ఎన్నికల బరిలో ఉండాలని భావిస్తున్న ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి టికెట్‌పై స్పష్టత లభించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన కారు దిగేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మనోహర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీలోకి రావాలని ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌లో వన్‌మెన్ షో..

బీఆర్‌ఎస్‌లో నియంతపాలన సాగుతోందని, వన్ మన్ షోతో పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నానని మనోహర్‌రెడ్డి 'సాక్షి'తో వ్యాఖ్యానించారు. పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకపోవడం, నమ్మి వెంట వచ్చిన కేడర్‌ను ఆ పార్టీ నేతలు పట్టించుకోక పోవడం తనను బాధించినట్లు స్పష్టంచేశారు. సొంత కార్యకర్తలకు కనీస న్యాయం చేయలేని పార్టీ, పదవి ఉంటే ఎంత..? లేకపోతే ఎంత..? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎజెండా నచ్చిందని, ఆ పార్టీలో చేరడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని భావిస్తున్నట్లు చెప్పారు.



కొత్తగూడలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

కేసీఆర్‌ది సంక్షేమ పాలన

- అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాం
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- బతుకమ్మ చీరలు, క్రీడా కిట్ల పంపిణీ

కందుకూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడ, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్ గ్రామాల్లో రూ.7.56 కోట్ల నిధులతో చేపట్టిన 35 అభివృద్ధి పనులను గురువారం సాయంత్రం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. కొత్తగూడలో కుమ్మరి, గిరిజన, నాయీబ్రాహ్మణ భవనాలకు శంకుస్థాపనలు చేసి, మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నామని స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, స్థానిక సర్పంచులు సాధ మల్లారెడ్డి, సదాలక్ష్మీపుల్లారెడ్డి, అనితశ్రీనివాస్, శ్రీదేవిశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ, సోమ్లానాయక్, ఎంపీటీసీలు గుండాల సురేష్, రాజమ్మ, లలితకుమార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యువ కెరటం..


ఓటేస్తేనే కిరీటం!

వయసు వారీగా ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	19 - 39	40 - 59	60 - 99
ఇబ్రహీంపట్నం	1,67,280	1,04,664	38,681
ఎల్బీనగర్	2,61,418	2,18,870	86,440
మహేశ్వరం	2,60,961	1,86,096	70,139
రాజేంద్రనగర్	2,77,402	2,00,882	64,023
శేరిలింగంపల్లి	3,36,287	2,71,339	90,412
చేవెళ్ల	1,26,900	88,207	38,753
కల్వకుర్తి	1,20,070	75,562	34,926
షాద్‌నగర్	1,20,194	73,752	31,504

వచ్చే ఎన్నికల్లో యువత ఓట్లే కీలకం

- అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం
- రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇదీ పరిస్థితి



సాక్షి,రంగారెడ్డి: నవ యుగానికి యువతరం బాటలు వేసే తరుణం ఆసన్నమవుతోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం యువతర మే నిర్ణయించబోతోంది. వారు వేసే ఓటుపైనే అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో నెలకొన్న పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 33, 55,274 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18 నుంచి 39 ఏళ్లలోపు వారు 16,70,492 మంది ఉండగా, 40 నుంచి 59 ఏళ్లలోపు వారు 12,19,372 మంది ఉన్నారు. 60 నుంచి 99 ఏళ్ల వయసు వారు 4,54, 878 మంది ఓటర్లు ఉండటం విశేషం. వీరిలో అత్య ధికులు 39 ఏళ్లలోపు వారే కావడం విశేషం. వందేళ్లు పైబడిన వారు మరో 532 మంది ఉన్నట్లు తాజా ఓటర్ల జాబితాలో వెల్లడైంది. వచ్చే ఎన్నికల్లో యువ ఓటర్లు కీలకంగా మారనున్నారనేందుకు ఇదే నిదర్శనం.

60 నుంచి 99 ఏళ్లవారు 4,54,878 మంది..

- 90 నుంచి 99 ఏళ్ల వయసు గల ఓటర్లు 6,336 మంది ఉన్నారు. వీరిలో ఇబ్రహీంపట్నంలో 543 మంది, ఎల్బీనగర్ 1189 మంది, మహేశ్వరం 1057 మంది, రాజేంద్రనగర్ 753 మంది, శేరిలింగంపల్లిలో 1121 మంది, చేవెళ్ల 649 మంది, కల్వ కుర్తి 531, షాద్‌నగర్ 493 మంది ఓటర్లు ఉన్నారు.
- 80 నుంచి 89 ఏళ్ల వయసువారు 36,669 మంది ఓటర్లు ఉండగా, 70 నుంచి 79 ఏళ్ల వయసు వారు 1,36,465 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 60 నుంచి 69 ఏళ్ల వయసు వారు 2,75,408 మంది ఓటర్లు ఉన్నారు.

శతాధిక వృద్ధులు 532 మంది

- 120 ఏళ్లు పైబడిన ఓటర్లు మొత్తం 155 మంది ఉండగా, వీరిలో ఇబ్రహీపట్నంలో ఇద్దరు, ఎల్బీనగర్‌లో ఇద్దరు, చేవెళ్లలో అత్యధికంగా 72 మంది, కల్వకుర్తిలో 79 మంది ఓటర్లు ఉన్నారు.
- 110 నుంచి 119 ఏళ్లున్న ఓటర్లు ఆరుగురు ఉన్నారు. వీరిలో ఇబ్రహీంపట్నంలో ఒకరు, ఎల్బీనగర్‌లో ముగ్గురు, రాజేంద్రనగర్‌లో ఒకరు, షాద్‌నగర్‌లో ఒకరు చొప్పున ఉన్నారు.
- 100 నుంచి 109 ఏళ్ల వయసుగల ఓటర్లు 371 మంది ఉండగా, వీరిలో ఇబ్రహీంపట్నంలో 58 మంది, ఎల్బీనగర్ 81 మంది, మహేశ్వరం 65, రాజేంద్రనగర్ 54, శేరిలింగంపల్లి 41, చేవెళ్ల 40. కల్వకుర్తి 13, షాద్‌నగర్‌లో 19 మంది ఓటర్లు ఉన్నారు.

రాజకీయ చైతన్యంతోనే బీసీలకు రాజ్యాధికారం

- ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్
- చేవెళ్లలో పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ
- హాజరైన ఎమ్మెల్యే కాలె యాదయ్య, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్లలో పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్లలో విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

చేవెళ్ల: రాజకీయ చైతన్యంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని, అన్ని కులాలను కలుపుకొని ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాబిన్ ఉడ్ పండుగ సాయన్న విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. కాసాని జ్ఞానేశ్వర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, సినీ నటుడు, యాంకర్ బిత్తిరి సత్తి అలియాస్ కావలి రవికుమార్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు అందె బాబయ్య తదితరులు విగ్రహావిష్కరణ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు, బీసీలను చైతన్యం చేసేందుకు తాము అనేక ప్రయత్నాలు చేశామని చెప్పారు. పండుగ సాయన్నను ఆదర్శంగా తీసుకుని యువత చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌లో ఒక్కరికి కూడా టికెట్ ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలు కృషిచేయాలి..

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పండుగ సాయన్నలాంటి మహావీరుల చరిత్ర పుస్తకాలలో ఎందుకు లేకుండా పోయిందని విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమాజం కోసం, రజాకార్లు, దొరలపై తిరుగుబాటు చేసిన మహనీయుల చరిత్ర భావితరాలకు తెలిసేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.

ఐక్యంగా సాగాలి..

ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు జగన్‌మోహన్, అందె బాబయ్య, తలారి మల్లేష్, నీలం మధు తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ కులాల్లో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లను అన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎంపీ, నామినేటెడ్ పదవుల్లో జనాభా ప్రతిపాదికన సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎం.బాల్‌రాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాసాని వీరేశం, బండారి వెంకటేశ్, లల్లు ముదిరాజ్, రాములు, జంగయ్య, సురేందర్, చేవెళ్ల నియోజకవర్గం మండలాల అధ్యక్షులు ఊరడి నర్సింలు, తెలుగు శ్రీనివాస్, పి.యాదయ్య, ఎస్.లింగం, టి.రాఘవేందర్, నాయకులు జొన్నాడ మైసయ్య, గణేష్, గోపాల్, శ్రీనివాస్, యాదయ్య, రాంప్రసాద్, రాంచందర్, చేవెళ్ల నియోజవకర్గంలోని ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభలో ఉత్తేజం నింపిన సత్తి..

పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ సభలో పాల్గొన్న సినీ నటుడు, బిత్తిరి సత్తి ఆకట్టుకునే ప్రసంగం చేశారు. సాయన్నపై పాట పాడుతూ ఆయన ఆదర్శాలను తెలియజేశారు. ఎవరి కులం వారికి గొప్ప అని.. దాన్ని గర్వంగా చెప్పుకోవాలని.. తాను అన్ని కులాలకు చెందిన స్నేహితులతో కలిసి ఎదిగిన తీరును వివరించారు.

మూడు కేజీల గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

- ముగ్గురు వ్యక్తులు అరెస్టు
- పరారీలో ఒకరు
- ఆదిబట్ల ఇటుక బట్టీల్లో దందా

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వారిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదిబట్లలో దాడులు నిర్వహించారు. శ్రీధనలక్ష్మి ఇటుక బట్టీల్లో పని చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం సాహెబ్‌గంజ్ గ్రామం, దనా జిల్లా మీర్‌చౌక్‌కు చెందిన వాతిన్ హైమద్(28), సలామ్ అన్సారీ (37)లు పట్టుకున్నారు. వారు ఇటుక బట్టీల్లో పని చేసే వారితో పాటు ఇతరులకు చిన్నచిన్న ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తారు. 142 గంజాయి ప్యాకెట్లు, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వకీల్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

3కేజీల గంజాయి స్వాధీనం..

ఆదిబట్లలోనీ టీసీఎస్ ఎదురుగా మరో వ్యక్తి అక్రమంగా గంజాయి తరలించి అమ్ముతున్నాడు. విషయం తెలుసుకున్న మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఒడిసా నుంచి హైదరాబాద్‌కు తరలించి గంజాయి విక్రయం చేపడుతున్నాడు. చత్తీష్‌ఘడ్ రాష్ట్రం కోలియా గ్రామం, బలోడ బజార్‌కు చెందిన వీరేంద్రకుమార్ వర్మ (22) టీసీఎస్ చుట్టుప్రక్కల వారికి విక్రయించడానికి ఒక్కొక్క ప్యాకెట్ కేజీ చొప్పున మూడు ప్యాకెట్లు తయారు చేసుకున్నాడు. వాటిని విక్రయించే క్రమంలో పట్టుబడ్డట్లు పోలీసులు తెలిపారు. గంజాయి ప్యాకెట్లతో పాటు సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిసాకు చెందిన శ్రీను పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళలకు గౌరవం పెరిగింది

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: నాలుగోసారి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి మహిళలు ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో గురువారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం కేసీఆర్ సర్కార్ కృషి చేస్తోందని అన్నారు. మహిళలకు గౌరవం పెరిగిందని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం, బీసీబంధు, ఐకేపీ ద్వారా మహిళలకు ప్రత్యేక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ సర్పంచులు ఇందిర పాల్గొన్నారు.

తులం బంగారు గుండ్లు అపహరణ

శంకర్‌పల్లి: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గుండ్లను అపహరించిన సంఘటన శంకర్‌పల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఇబ్రహింపల్లి గ్రామానికి చెందిన అనసూయ(65) శంకర్‌పల్లికి పని నిమిత్తం వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా అనసూయ మెడలోని తులం గుండ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ నాగరాజు తెలిపారు.

డెకాయ్ ఆపరేషన్‌తో నిందితుడి అరెస్టు

- 15 రోజుల్లో 83 మంది పోకిరీలపై కేసులు
- ఇందులో 51 మంది మైనర్లే
- తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్
- రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్

సాక్షి, సిటీబ్యూరో: నేరెడ్‌మెట్ ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయి ఇంటర్మీడియట్ సెకెండియర్ చదువుతుంది. కాలేజీకి వెళ్లి వస్తున్న క్రమంలో నేరెడ్‌మెట్ క్రాస్ రోడ్ వద్ద ఆమెకు గతంలో పరిచయం ఉన్న వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో మెసేజ్‌లకు రిప్లై ఇవ్వనందుకు అమ్మాయిని నడి రోడ్డుపై చెంప చెళ్లుమనిపించాడు. అదే సమయంలో అక్కడ మఫ్టీలో డెకాయ్ ఆపరేషన్‌లో ఉన్న కుషాయిగూడ షీ టీమ్స్ పోలీసులు ఈ సంఘటనను వీడియో తీశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు నేరెడ్‌మెట్ పీఎస్‌లో కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇలా గత 15 రోజులలో 83 మంది ఆకతాయిల ఆటకట్టించారు రాచకొండ షీ టీమ్స్ పోలీసులు.

- 15 రోజులలో 83 మంది ఆకతాయిలను రాచకొండ షీ టీమ్స్ పట్టుకున్నారు. ఇందులో 32 మంది మేజర్లు కాగా 51 మంది మైనర్లు ఉండటం గమనార్హం. 13 కేసులు మహిళలను నేరుగా వేధించనవి కాగా.. వాట్సాప్, మెసేజ్‌ల ద్వారా 23, సామాజిక మాధ్యమాలలో 20 కేసులున్నాయి. వీటిల్లో 16 మంది పోకిరీలపై క్రిమినల్, 21 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. 39 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీసులో ఆకతాయిలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో గురువారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ.. మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూల్స్, కాలేజీలు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నామని చెప్పారు. మహిళలను వేధించే ఆకతాయిలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేత బద్రినాథ్

సాక్షి, సిటీబ్యూరో: సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సి.బద్రినాథ్ యాదవ్ వందమందికి పైగా తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. బద్రినాథ్‌యాదవ్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన ఇతర బీఆర్‌ఎస్ నాయకులు ఓంచరణ్, స్వామి,మహేశ్ రెడ్డి, వెంకటేశ్, సంజు, ధర్మేంద్ర, అరవింద్, సాంబశివ, రామ్‌కుమార్, భరత్‌యాదవ్ తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

66మంది బైండోవర్

అబ్దుల్లాపూర్‌మెట్: వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాలు చేసినటువంటి 66మందిని గురువారం పోలీసులు మండల తహసీల్దార్ రవీందర్‌దత్ ఎదుట బైండోవర్ చేశారు. ఇందులో రౌటీషీట్ ఉన్న వ్యక్తులు, పలు ఎన్నికల సమయంలో కేసులు నమోదైన వ్యక్తులు, దొంగతనాల కేసులో జైలుకు వెళ్లిన వారు, గొడవల్లో జోక్యం చేసుకొని వ్యక్తులను గాయపర్చిన వ్యక్తులు మొత్తం 66మందిని బైండోవర్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు తిరిగి ఎలాంటి నేరాలు, వివాదాల్లో జోక్యం చేసుకుంటే వారికి రూ. లక్ష జరిమానాతో పాటు వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

నేపాల్ బాలిక అదృశ్యం



సజినా (ఫైల్)

పహాడీషరీఫ్: నేపాల్ బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన బిక్రం సప్‌కోట భార్య పిల్లలతో ఐదేళ్ల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ నెల 4వ తేదీనా రాత్రి 10.45 గంటల సమయంలో అతని పెద్ద కుమర్తె సజినా సప్‌కోట (17) ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. ఆమె ఎంతకి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ జాతీయ రహదారి పక్కనే రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 65-70 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం కోసం వెతకగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ప్రాంతంలో, రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు సర్వే నెంబర్ 6, 7లో ఇండ్ల స్థలాలు కేటాయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి శానమోని పాండుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూర్ చేయాలని ఆయన కోరారు.

నేడు అల్పాహార పథకం ప్రారంభం

కడ్తాల్: కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించనున్నట్లు నోడల్ అధికారి జంగయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిందండ్రులు హాజరుకావాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వంటావార్పు



వంటా వార్పు చేపట్టిన కార్మికులు

శంషాబాద్: తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన దీక్ష గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేష్ మాట్లాడుతూ..మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర సర్కారు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. వెంటనే చర్చలకు పిలిచి వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్: పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపనకు మంత్రులు కేటీఆర్, పట్నం మహేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తద్వార అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ 1 స్థానంలో ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అఖండ విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణలో ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు తప్పా మరే పార్టీకి లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జిల్లా రైతు సమన్వయ కమిటీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఇందిర, భీష్వ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

లుక్ ఔట్‌కు చిక్కిన సైబర్ కేటుగాడు!

- ప్రముఖ ఐటీ కంపెనీల నకిలీ ఈ-మెయిల్స్
- ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల
- ఓ బాధితుడి నుంచి రూ.37.50 లక్షలు లూటీ
- దుబాయ్ నుంచి ముంబై ఎయిర్‌పోర్ట్
- పీటీ వారెంట్‌పై కాళీ ప్రసాద్‌ను రాచకొండకు తరలింపు



సాక్షి, సిటీబ్యూరో: దుబాయ్‌లో నక్కి ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తుడిని లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ)తో వల వేసి పట్టుకున్నారు రాచకొండ సైబర్ కాప్స్. పోలీసులు తెలిపిన మేరకు.. ఒడిశాకు చెందిన కాళీ ప్రసాద్ రాత్, పుణేకు చెందిన అభిజిత్ అరుణ్ నెకాటేతో ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, ఐబీఎం, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలలో ఉద్యోగాలు అని నకిలీ ఈ-మెయిల్స్ పంపించి నిరుద్యోగులను మోసం చేస్తున్నారు.

- ఐటీ కంపెనీల నకిలీ గుర్తింపు కార్డులు, ఈ-మెయిల్స్‌లను సృష్టించారు. నేరాలకు సంబంధించిన లావాదేవీలు జరిపేందుకు వివిధ బ్యాంకుల నుంచి ఖాతాలను సైతం తెరిచారు. వివిధ మార్గాలలో నిరుద్యోగుల డేటాను సమీకరించి, వారికి ఐటీ కంపెనీల పేరుతో నకిలీ ఈ-మెయిల్స్ పంపిస్తున్నారు.
- ఈక్రమంలో రాచకొండ పరిధికి చెందిన అజయ్ కుమార్‌కు కాగ్నిజెంట్ కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ పేరుతో నకిలీ ఈ-మెయిల్ పంపించారు. బాధితుడిని నమ్మించి దరఖాస్తు, రిజిస్ట్రేషన్ ఫీజు, లీగల్ డాక్యుమెంటేషన్, ఆన్‌బోర్డింగ్, ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ ఇలా రకరకాల పేర్లతో రూ.37.4 లక్షలు వసూలు చేశారు. ఆఫర్ లెటర్ రాకపోయే సరికి మోసపోయానని గ్రహించిన అజయ్.. ఈ ఏడాది మార్చి 27న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో నిందితుడు కాళీ ప్రసాద్ రాత్ దుబాయ్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎల్‌ఓసీని జారీ చేశారు. ఈక్రమంలో గత నెల 21న నిందితుడు దుబాయ్ నుంచి ముంబై విమానాశ్రయంలో దిగాడు. దీంతో ఇమిగ్రేషన్ అధికారులు నిందితుడ్ని పట్టుకొని విచారణాధికారి (ఐఓ)కు సమాచారం అందించారు. చట్టపరమైన వ్యవహారాలు పూర్తి చేసిన అనంతరం.. కాళీ ప్రసాద్‌ను పీటీ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.
- కాళీ ప్రసాద్ అరెస్టుతో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్‌లో నమోదైన మొత్తం 8 కేసులలో మిస్టరీ వీడినట్లయింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బీ రాజు, ఏ నరసింహా స్వామిలు, బృందానికి కమిషనర్ డీఎస్ చౌహాన్ అభినందించారు.